


www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY




సంపుటి: 02 | సంచిక: 278 | హైదరాబాద్ | ఆదివారం | 01-02-2026 | పేజీలు: 08



నేడు కేంద్ర బడ్జెట్ 2026-27ను ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్

రక్షణ, మౌలిక సదుపాయాలు, మూలధన వ్యయంపై దృష్టి సారించే అవకాశం

వృద్ధికి ఊతమిస్తూనే ఆర్థిక క్రమశిక్షణ పాటించడంపై ప్రభుత్వం దృష్టి

ప్రధాని మోదీ ప్రభుత్వంలో ఇది 15వ బడ్జెట్.. నిర్మలా సీతారామన్‌కు 9వది

## వృద్ధి మంత్రం.. పొదుపు సూత్రం..

హైదరాబాద్, (సిద్దిపేట పవర్):

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రేపు (ఫిబ్రవరి 1న) పార్లమెంటులో 202627 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు. ఈసారి బడ్జెట్‌లో వృద్ధి వేగాన్ని కొనసాగిస్తూనే, సంక్షేమ పథకాలకు, ఆర్థిక క్రమశిక్షణకు మధ్య ప్రభుత్వం సమతుల్యత పాటించనుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా రక్షణ, మౌలిక సదుపాయాలు, మూలధన వ్యయం, విద్యుత్, అందుబాటు ధరల్లో గృహ నిర్మాణం వంటి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వవచ్చని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో దేశీయ వృద్ధి లక్ష్యాలకు, ద్రవ్యలోటు నియంత్రణకు మధ్య బడ్జెట్ ఒక చక్కటి సమన్వయాన్ని సాధించాల్సి ఉంది. ప్రభుత్వం ఇప్పటికే ఆర్థిక క్రమశిక్షణ ..మిగతా 2లో

## నోటీసులు అక్రమం.. అయినా విచారణకు వస్తా.!



విచారణకు హాజరు కావడానికి చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వలేదన్న కేసీఆర్

నోటీసు అంటించడం ద్వారా గౌరవానికి భంగం కలిగించారని పేర్కొన్న కేసీఆర్

సిట్‌కు ఆరు పేజీల లేఖ రాసిన కేసీఆర్

సిట్ విచారణాధికారిగా ఉన్న జూబ్లీహిల్స్ ఏసీపీకి లేఖ

6 పేజీల లేఖలో పలు అంశాలను ప్రస్తావించిన కేసీఆర్

రేపు మ.3 గంటలకు అందుబాటులో ఉంటానన్న కేసీఆర్

ఇంటి గోడకి సిట్ నోటీసులు అంటించడంపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం

చట్టంలో గోడకు నోటీసులు అంటించమని ఎక్కడా లేదు.

బాధ్యతాయుత పౌరుడిగా, ప్రతిపక్ష నేతగా విచారణకు సహకరిస్తానన్న కేసీఆర్

హైదరాబాద్, (సిద్దిపేట పవర్):

సిట్ అధికారులు నందినగర్‌లోని తన ఇంటి గోడలకు నోటీసులు అంటించడంపై బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరికి ఆయన లేఖ రాశారు. చట్టపరమైన అభ్యంతరాలున్నా తాను విచారణలో సిట్‌కు సహకరిస్తానని చెప్పారు. ఫిబ్రవరి 1న మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు సిద్ధంగా ఉంటానని తెలిపారు. గోడలకు నోటీసులు అంటించడం సరైన పద్ధతి కాదని కేసీఆర్ పేర్కొన్నారు. సిట్ పోలీసుల వైఖరి కోర్టు ధిక్కారం కిందకే వస్తుందని తెలిపారు. పోలీసుల తీరు నా వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించే విధంగా ఉందని వెల్లడించారు. ఏసీపీ వెంకటగిరికి తనను విచారించే అధికార పరిధి లేదని పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన పౌరుడిగా, ప్రతిపక్ష నేతగా విచారణకు ..మిగతా 3లో

## మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా సునేత్రా పవార్ ప్రమాణస్వీకారం..

ముంబైలోని లోక్ భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్

ఫడ్నవీస్, ఏక్‌నాథ్ షిండే సమక్షంలో ప్రమాణం

సునేత్రాకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ



## సింగరేణిలో అక్రమాలు నిజమే..

టెండర్ల ఖరారు, సీఎస్ఆర్ ఫండ్ ఖర్చులో అవకతవకలు

సైట్ విజిట్ సర్టిఫికెట్‌తో టెండర్ ప్రక్రియ ప్రభావితమైంది

సెల్ఫ్ సర్టిఫికెట్‌కు బదులు అధికార ప్రమేయంలో దురుద్దేశం

ఉద్దేశించిన లక్ష్యం కోసం సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేయలేదు

కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖకు కమిటీ ప్రాథమిక నివేదిక

ప్రైవేట్ ఈవెంట్‌కు 10 కోట్లు ఖర్చు చేయడంపై అభ్యంతరం

నిధుల మళ్లింపు వెనుక ఉన్న అధికారిపై విచారణకు సిఫారసు



## మోదీ ప్రభుత్వంతో సయోధ్య కోరుకుంటున్నాం



బడ్జెట్‌లో తెలంగాణకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి

బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి నిధులు వచ్చేలా కృషి చేయాలని సూచన

బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం జరగాలన్న పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, (సిద్దిపేట పవర్):

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంతో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం సయోధ్య కోరుకుంటోందని ..మిగతా 2లో

## ఇది అహంకారం కాకపోతే మరేంటి?

హైదరాబాద్, (సిద్దిపేట పవర్):

ఫోన్ ట్యాపింగ్ కేసులో సాక్షిగా విచారించేందుకు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చిన తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ సాధకుడు, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మీద ఈ దుర్మార్గపు వైఖరి ఏంది రేవంత్ రెడ్డి గారూ? అని ప్రశ్నించారు. స్వయంగా కేసీఆర్ గారే తానుంటున్న నివాసం అడ్రస్‌తో సహా మీ పోలీసులకు రిప్లై ఇచ్చాక కూడా ఆయన లేని నివాసానికి రాత్రిపూట వచ్చి గేటుకు నోటీసులు అంటించి పైశాచిక ఆనందం పొందడం దారుణమని మండిపడ్డారు. ఇది అహంకారం కాకపోతే మరేమిటని ..మిగతా 2లో

ప్రభుత్వం, పోలీసుల తీరుపై మండిపడిన కేటీఆర్..

కేసీఆర్ పై ఈ దుర్మార్గపు వైఖరి ఏంది రేవంత్ రెడ్డి..

కేసీఆర్ లేని ఇంటికి రాత్రి వేళ నోటీసులు అంటించి వెళ్లడం దారుణం: కేటీఆర్



## ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

కరీంనగర్ సీపీపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్న కౌశిక్ రెడ్డి

ఆరోపణలు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్

లేదంటే ఐపీఎస్ అసోసియేషన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్

క్షమాపణ చెప్పకుంటే ప్రివిలేజ్ మోషన్ పెడతానని హెచ్చరిక



## చివరి టీ20 మనదే... కివీస్ పోరాటం చాల్లేదు!

ఐదో టీ20లో భారత్ ఘనవిజయం..


4-1తో సిరీస్ కైవసం

కేవలం 42 బంతుల్లో సెంచరీ నమోదు చేసిన ఇషాన్ కిషన్

ఐదు వికెట్లు పడగొట్టి కివీస్ పతనాన్ని శాసించిన అర్షదీప్ సింగ్

80 పరుగులతో ఒంటరి పోరాటం చేసిన న్యూజిలాండ్ బ్యాటర్ ఫిన్ అలెన్

టీ20 ప్రపంచకప్‌కు ముందు టీమిండియాకు కీలక విజయం




హైదరాబాద్, (సిద్దిపేట పవర్):

న్యూజిలాండ్‌తో జరిగిన ఐదో, చివరి టీ20లో టీమిండియా 46 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఇషాన్ కిషన్ (103) విధ్వంసక సెంచరీకి, అర్ష్‌దీప్ సింగ్ (5/51) ఐదు వికెట్ల ప్రదర్శన తోడవడంతో భారత్ అద్భుత విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల ..మిగతా 2లో

## భారత్ పై ట్రంప్ 50%సుంకాలు...

సొంత ప్రయోజనాలకు రాజీపడి ఏ దేశం కూడా ఇతర దేశాలతో చర్చలు జరపబోదని వ్యాఖ్య

50 శాతం సుంకాలు విధించడం ట్రంప్ మూర్ఖత్వపు మనస్తత్వానికి నిదర్శనమని ఆగ్రహం

భారత్, రష్యా దశాబ్దాలుగా మిత్ర దేశాలుగా కొనసాగుతున్నాయని వ్యాఖ్య



హైదరాబాద్, (సిద్దిపేట పవర్):

భారతదేశం తన సొంత ప్రయోజనాలను కాదని, అమెరికా చెప్పే ప్రతిదానికి తలాడించదని యూఎస్ రిటైర్డ్ ఆర్మీ కల్నల్, రక్షణ రంగ నిపుణుడు డగ్లస్ మాక్‌గ్రెగర్ అన్నారు. సొంత ప్రయోజనాలకు రాజీపడి ఏ దేశం కూడా ఇతర దేశాలతో చర్చలు జరపబోదని అన్నారు. రష్యాతో వ్యాపారం ..మిగతా 2లో

## బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా మన అభ్యర్థులు ఉండాలి

అమెరికా నుంచి జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న రేవంత్ రెడ్డి

మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్న ముఖ్యమంత్రి

అభ్యర్థుల ఎంపికలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని సూచన

ఎన్నికల్లో సమిష్టిగా పని చేయాలని పిలుపు

చైర్మన్, మేయర్ అభ్యర్థుల ప్రకటనపై వ్యూహాత్మక నిర్ణయం

స్థానిక స్థాయిలో పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి



హైదరాబాద్, (సిద్దిపేట పవర్):

బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా కాంగ్రెస్ అభ్యర్థులు ఉండాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ జూమ్ మీటింగ్ నిర్వహించింది. ఈ జూమ్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా నుంచే పాల్గొని పలు సూచనలు చేశారు. మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికలో ..మిగతా 2లో




# చివరి టీ20 మనదే... కివీస్ పోరాటం చాల్లేదు!

మొదటిపేజీ తరువాయి

సిరీస్‌ను 41 తేడాతో భారత్ కైవసం చేసుకుంది. భారత్ నిర్దేశించిన 272 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో, కివీస్ 19.4 ఓవర్లలో 225 పరుగులకు ఆలౌట్ అయింది. భారీ లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్‌కు ఫిన్ అలెన్ (38 బంతుల్లో 80) అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. దీంతో కివీస్ పవర్‌ప్లేలో వికెట్ నష్టానికి 79 పరుగులు చేసి భారత్‌పై తమ అత్యుత్తమ పవర్‌ప్లే స్కోరును నమోదు చేసింది. అయితే, దూకుడుగా ఆడుతున్న అలెన్‌ను అక్షర్ పటేల్ (3/33) పెవిలియన్ పంపడంతో మ్యాచ్ మలుపు తిరిగింది.
తొలి స్పెల్‌లో భారీగా పరుగులు ఇచ్చినప్పటికీ, అర్షదీప్ సింగ్ తన రెండో స్పెల్‌లో అద్భుతంగా రాణించాడు. కీలకమైన రచిన్ రవీంద్ర (30) వికెట్‌తో పాటు మరో నాలుగు వికెట్లు తీసి కివీస్ పతనాన్ని శాసించాడు. దీంతో న్యూజిలాండ్ 19.4 ఓవర్లలో 225 పరుగులకు ఆలౌట్ అయింది. టీ20 ప్రపంచకప్‌కు వారం ముందు ఈ సిరీస్ విజయం భారత జట్టు ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచనుంది.
అంతకుముందు, టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 271 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ ఇషాన్ కిషన్ కేవలం 42 బంతుల్లోనే తన తొలి టీ20 అంతర్జాతీయ శతకాన్ని నమోదు చేశాడు. అతనికి కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (63) చక్కటి సహకారం అందించాడు. చివర్లో హార్దిక్ పాండ్యా (17 బంతుల్లో 42) మెరుపు ఇన్నింగ్స్‌తో భారత్ స్కోరును అమాంతం పెంచాడు. ఇది టీ20 ఫార్మాట్‌లో భారత్‌కు మూడో అత్యధిక స్కోరు కావడం విశేషం.

### బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు దీటుగా

# మన అభ్యర్థులు ఉండాలి

మొదటిపేజీ తరువాయి

నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని అన్నారు.
ప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపు మనకు ముఖ్యమే అన్నారు. రెబల్స్ విషయంలో మాట్లాడి స్వయంగా సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. పార్టీ బలహీనంగా ఉన్న మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, మంత్రుల మధ్య అంతరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు, పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు.



# వృద్ధి మంత్రం.. పొదుపు సూత్రం..

మొదటిపేజీ తరువాయి

మార్గంలో స్థిరంగా పయనిస్తోంది. కోవిడ్ సమయంలో 9.2 శాతంగా ఉన్న ద్రవ్యలోటును 2026 ఆర్థిక సంవత్సరానికి 4.4 శాతానికి తగ్గించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ మార్గం నుంచి ప్రభుత్వం పెద్దగా పక్కకు వెళ్లకపోవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు.
ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఇది 15వ బడ్జెట్ కాగా, నిర్మలా సీతారామన్ వరుసగా తొమ్మిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రికార్డు సృష్టించనున్నారు. గత బడ్జెట్‌లో మధ్యతరగతి వినియోగాన్ని పెంచేందుకు పన్ను రాయితీలపై దృష్టి సారించగా, ఈసారి వినియోగాన్ని ప్రోత్సహించే విధానం పరిమితంగానే ఉంటుందని తెలుస్తోంది. వ్యూహాత్మకంగా ముఖ్యమైన రంగాల్లో మూలధన వ్యయాన్ని పెంచడంపైనే ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించవచ్చని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. పెట్టుబడిదారులు ప్రభుత్వ రుణాల వివరాలు, ద్రవ్యలోటు లక్ష్యాలు, కొత్త అప్పుల ప్రణాళికలపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.
ఇటీవల ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 202526, వచ్చే ఆర్థిక సంవత్సరానికి (FY27) వృద్ధి రేటు 6.8% నుంచి 7.2% మధ్య ఉండవచ్చని అంచనా వేసింది. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 7.4% కంటే కొంచెం తక్కువ. బడ్జెట్ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, ఫిబ్రవరి 1 ఆదివారం అయినప్పటికీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో పూర్తిస్థాయి ట్రేడింగ్ నిర్వహించాలని నిర్ణయించారు.



# ఇది అహంకారం కాకపోతే మరేంటి?

మొదటిపేజీ తరువాయి

నిలదీశారు.
65 ఏళ్లు దాటిన వ్యక్తులను వారుంటున్న నివాసం వద్దనే విచారించాలన్న రూల్ కూడా పోలీసులు అతిక్రమిస్తున్నారని కేటీఆర్ అన్నారు.అసలు మీ పోలీసులకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ మీద అవగాహన ఉందా? లేక మీచేతిలో కీలుబొమ్మల్లా ఇట్లా ప్రతిపక్ష నాయకులను వేధించడమే పనా? అని ప్రశ్నించారు. చట్టం మీద, న్యాయం మీద, ధర్మం మీద మీకు గౌరవం లేకపోవచ్చు, కానీ మాకు వాటిమీద పూర్తి విశ్వాసం ఉన్నదని అన్నారు. ఈ అక్రమ కేసులన్నీ ఛేధిస్తామని తెలిపారు. మీ ప్రతి తప్పుడు పనిని వెలికితీసి తెలంగాణ ప్రజల ముందు పెడతామన్నారు. మీరెన్ని వేధింపులకు పాల్పడుతున్నారో ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. తప్పకుండా సమయం వచ్చినప్పుడు మీకు సిద్దిపేట పవర్లోనే వారు బుద్ధిచెబుతారని స్పష్టం చేశారు.

**గోడకు నోటీసులు అంటించి వెళ్లిన సిట్ అధికారులు**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ అధికారులు మరోసారి నోటీసులు ఇచ్చారు. బంజారాహిల్స్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలో శుక్రవారం రాత్రి 9.30 ప్రాంతంలో.. ఎవ్వరూలేని సమయంలో వచ్చిన సిట్ అధికారులు నోటీసులను గోడకు అంటించి వెళ్లారు. 160 సీఆర్పీసీ కిందనే నోటీసులు ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు తప్పనిసరిగా విచారణకు హాజరుకావాలని కోరారు. కాగా ప్రస్తుత తన అధికారిక నివాసం ఎర్రవల్లిలో ఉన్నదని, అక్కడే తనను విచారించాలని గురువారం రాత్రి కేసీఆర్ ఇచ్చిన సమాధానంపై తాజాగా ఇచ్చిన నోటీసుల్లో సిట్ అధికారులు పలు అంశాలను ప్రస్తావించారు.

**నోటీసుల్లో ఏమున్నదంటే:**

'మీరు 29న సమర్పించిన రిప్లయ్‌లో.. సిద్దిపేట జిల్లా మరూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలోని మీ ప్రస్తుత నివాసంలో మిమ్మల్ని విచారించాలని కోరారు. ఎలక్షన్ అఫిడవిట్, రాష్ట్ర శాసనసభ రికార్డులు సహా అధికారిక రికార్డుల ప్రకారం మీ నివాసం నందినగర్ అని ఉన్నది.
పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన క్రైం నంబర్ 243/2024 కేసు దర్యాప్తునకు సంబంధించిన 160 సీఆర్పీసీ కింద నోటీసు జారీచేశాం. మేము గతంలో ఇచ్చిన నోటీసులను ఆ చిరునామాలోనే మొదట స్వీకరించారు. దానిని అందుకున్న తర్వాతే మీరు సమాధానం పంపించారు. సెక్షన్ 160 సీఆర్పీసీ నిబంధనల ప్రకారం, కేసు వివరాలు తెలిసిన వ్యక్తులు సంబంధిత పోలీస్‌స్టేషన్ పరిధిలోనే విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది. దాని ప్రకారం, నోటీసులు మీ హైదరాబాద్ నివాసంలో అందజేశాం.. మీరు దానికి సమాధానం కూడా ఇచ్చారు. అయినప్పటికీ, మీ వయసును పరిగణనలోకి తీసుకుని, సెక్షన్ 160 సీఆర్పీసీలోని మినహాయింపును దృష్టిలో ఉంచుకుని, రికార్డుల ప్రకారం ఉన్న మీ నివాస చిరునామాలోనే విచారణ జరుపుతామని మేము తెలిపాం.
దర్యాప్తు ప్రయోజనాలను, మీ వయస్సును దృష్టిలో ఉంచుకొని, చట్టపరమైన నిబంధనల ప్రకారం అధికారిక రికార్డులలో ఉన్న మీ నివాసంలోనే విచారణ చేస్తామని దర్యాప్తు సంస్థ స్వచ్ఛందంగా తెలియజేస్తున్నది. మా వద్ద ఉన్న అధికారిక రికార్డులలో లేని నివాసంలో విచారణ జరపాలని మీరు చేసిన అభ్యర్థనను అంగీకరించలేం. ఎందుకంటే విచారణా స్థలం అనేది అధికారిక రికార్డుల్లో చూపించిన వాటి ఆధారంగా నిర్ణయించబడుతుంది. అంతేకాకుండా, ఈ విచారణలో అత్యంత సున్నితమైన అనేక ఎలక్ట్రానిక్, భౌతిక రికార్డులను పరిశీలించవలసి ఉంటుంది. వాటిని ఎర్రవల్లి గ్రామానికి తరలించలేము. కాబట్టి మీరు ఫిబ్రవరి ఒకటోతేదీన మధ్యాహ్నం 3 గంటలకు విచారణ నిమిత్తం హైదరాబాద్‌లోని మీ నివాసంలో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి' అంటూ విచారణాధికారి పీ వెంకటగిరి నోటీసుల్లో పేర్కొన్నారు.



# మోదీ ప్రభుత్వంతో సయోధ్య కోరుకుంటున్నాం

మొదటిపేజీ తరువాయి



రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వచ్చే కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కేంద్రం నిధులు కేటాయించేలా రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు కృషి చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం జరగాలని ఆకాంక్షించారు.
బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏమేం కావాలో ఎప్పటి నుంచో అడుగుతున్నామని అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరుతున్నామని అన్నారు. తెలంగాణ పట్ల ప్రధాని నరేంద్ర మోదీ చిన్నచూపు చూస్తున్నారని ఆరోపించారు. గతంలో తెలంగాణ పుట్టుకనే ఆయన అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు.
కేంద్రం నుంచి ఏమీ అడగబోమని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అహంకారం ప్రదర్శించిందని, తాము మాత్రం సఖ్యత కోరుకుంటున్నామని అన్నారు. బడ్జెట్‌లో తమ ప్రతిపాదనలకు కేంద్రం అంగీకరించాల్సిందేనని స్పష్టం చేశారు. భారత ఫ్యూచర్ సిటీకి కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నిలిచిపోయిన ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలపాలని అన్నారు.

# భారత్ పై ట్రంప్ 50 శాతం సుంకాలు...

మొదటిపేజీ తరువాయి



చేస్తోందన్న కారణంతో భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు 50 శాతం సుంకాలు విధించడం ట్రంప్ మూర్ఖ మనస్తత్వానికి నిదర్శనమని మండిపడ్డారు.
కొంతకాలంగా అమెరికా, భారత్ మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ చర్చలపై డగ్లస్ స్పందిస్తూ, అమెరికా ఎప్పుడూ కూడా ప్రపంచ దేశాలు తమకు అనుకూలంగా ఉండాలని కోరుకుంటుందని, లేదంటే వ్యతిరేకంగా ఉన్నాయని భావిస్తుందని అన్నారు. అమెరికా చెప్పే ప్రతి అంశంతో లేదా అమెరికా చేసే ప్రతి దానితో భారత్ ఎప్పుడూ ఏకీభవించాలని చూడవద్దని అన్నారు.
దశాబ్దాలుగా భారత్, రష్యా మిత్ర దేశాలుగా కొనసాగుతున్నాయని, ఇప్పుడు వాటిని కలిసి వ్యాపారం చేయవద్దంటే అవి అమెరికాను వ్యతిరేకించే అవకాశం ఉందని అన్నారు. "మీరు రష్యాతో వ్యాపారం చేస్తే కనుక మేం మీకు వ్యతిరేకం" అనేది మూర్ఖత్వమని అన్నారు. మలేసియా వంటి దేశాలు అమెరికాతో వాణిజ్య ఒప్పందం కోసం తమ ముఖ్య విధానాల విషయంలో కూడా రాజీపడాల్సి వచ్చిందని అన్నారు. ప్రపంచ దేశాలపై బెదిరింపులకు పాల్పడుతూ ఇష్టారీతిన సుంకాలు విధిస్తే అది అమెరికాకే నష్టమని అన్నారు.

# మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా సునేత్రా పవార్ ప్రమాణస్వీకారం..

- ముంబైలోని లోక్ భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయించిన గవర్నర్
- ఫడ్నవీస్, ఏక్‌నాథ్ షిండే సమక్షంలో ప్రమాణం
- సునేత్రాకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ



**మహారాష్ట్ర, (సిద్దిపేట పవర్):**

రాజ్యసభ ఎంపీ సునేత్రా పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రంలో ఆ పదవి వరించిన తొలి మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. ముంబైలోని లోక్‌భవన్‌లో, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సమక్షంలో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమెతో ప్రమాణం చేయించారు.
సునేత్రా పవార్ ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం లోక్ భవన్‌లో 'అజిత్ దాదా అమర్ రహే' అంటూ నినాదాలు ప్రతిధ్వనించాయి. సునేత్రా పవార్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. అజిత్ పవార్ దార్శనికతను సునేత్రా నెరవేరుస్తారని ఆయన ఆకాంక్షించారు.
"మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన, ఈ బాధ్యతను చేపట్టిన మొదటి మహిళ సునేత్రా పవార్ జీకి శుభాకాంక్షలు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఆమె అవిశ్రాంతంగా పనిచేస్తారని మరియు దివంగత అజిత్‌దాదా పవార్ దార్శనికతను నెరవేరుస్తారని నేను విశ్వసిస్తున్నాను" అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో చేసిన పోస్టులో పేర్కొన్నారు.కాగా, ఇటీవల బారామతిలో జరిగిన విమాన ప్రమాదంలో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణం చెందారు. దీనితో ఆ పార్టీ శాసనసభా పక్ష నేతగా ఆయన భార్య సునేత్రా పవార్‌ను ఎన్సీపీ వర్గాలు ఎన్నుకున్నాయి. దీంతో ఆమె ఈ రోజు ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

# ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

- కరీంనగర్ సీపీపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్న కౌశిక్ రెడ్డి
- ఆరోపణలు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్
- లేదంటే ఐపీఎస్ అసోసియేషన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్
- క్షమాపణ చెప్పకుంటే ప్రివిలేజ్ మోషన్ పెడతానని హెచ్చరిక



**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘానికి మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. కరీంనగర్ సీపీ మత మార్పిడులకు పాల్పడుతున్నారని తాను వ్యాఖ్యానించినట్లు ఐపీఎస్ అసోసియేషన్ చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఆ ఆరోపణలను నిరూపిస్తే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, రాజకీయాల నుంచే శాశ్వతంగా తప్పుకుంటానని సంచలన సవాల్ విసిరారు.
ఈ సందర్భంగా కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. "మత మార్పిడి చేస్తున్నట్టు కరీంనగర్ సీపీని నేను అన్నట్లు నిరూపించాలి. ఆ మాట నేను అనలేదు. తెలంగాణ ఐపీఎస్ అసోసియేషన్ చేసిన ఆరోపణలలో వాస్తవం లేదు" అని స్పష్టం చేశారు. తనపై చేసిన ఆరోపణలను నిరూపించడంలో విఫలమైతే ఐపీఎస్ అసోసియేషన్ నాయకులు తనకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవేళ వారు క్షమాపణ చెప్పని పక్షంలో, వారిపై సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం (ప్రివిలేజ్ మోషన్) ప్రవేశపెడతానని కౌశిక్ రెడ్డి హెచ్చరించారు. వీణవంక మినీ సమ్మక్కసారలమ్మ జాతర సందర్భంగా పాడి కౌశిక్ రెడ్డికి, పోలీసులకు మధ్య తీవ్ర తోపులాట, వాగ్వాదం జరగడం తెలిసిందే. దాంతో కౌశిక్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేయగా, పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

# సింగరేణిలో అక్రమాలు నిజమే..

- **టెండర్ల ఖరారు, సీఎస్ఆర్ ఫండ్ ఖర్చులో అవకతవకలు**
- **సైట్ విజిట్ సర్టిఫికెట్‌తో టెండర్ ప్రక్రియ ప్రభావితమైంది**
- **సెల్ఫ్ సర్టిఫికెట్‌కు బదులు అధికార ప్రమేయంలో దురుద్దేశం**
- **ఉద్దేశించిన లక్ష్యం కోసం సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేయలేదు**
- **కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖకు కమిటీ ప్రాథమిక నివేదిక**
- **ప్రైవేట్ ఈవెంట్‌కు 10 కోట్లు ఖర్చు చేయడంపై అభ్యంతరం**
- **నిధుల మళ్లింపు వెనుక ఉన్న అధికారిపై విచారణకు సిఫారసు**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

సింగరేణి టెండర్ల ఖరారులో అవకతవకలు జరిగాయని సాంకేతిక కమిటీ నిర్ధారించినట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. టెండర్ల ఖరారులో కచ్చితమైన నిబంధనలు పాటించలేదని, బోర్డుకు ఉన్న స్వయంప్రతిపత్తి హోదాను అడ్డం పెట్టుకొని యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించారని కమిటీ గుర్తించినట్టు సమాచారం. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) నిధులను కూడా ఇష్టానుసారంగా ఖర్చు చేశారని, ఉద్దేశించిన లక్ష్యం కోసం నిధుల వినియోగం జరగలేదని తేల్చినట్టు తెలుస్తున్నది. స్థానిక ప్రజల సంక్షేమం, విద్య, వైద్యం కోసం ఉపయోగించాల్సిన సీఎస్ఆర్ నిధులను దారి మళ్లించి దుబారా చేశారని గుర్తించినట్టు సమాచారం. సింగరేణి బొగ్గు గనుల టెండర్ల అవకతవకలపై విచారణ జరిపేందుకు కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ వేసిన సాంకేతిక కమిటీ ప్రాథమిక నివేదికను అందజేసినట్టు కేంద్ర వర్గాలు తెలిపాయి.

**సెల్ఫ్ డిక్లరేషన్ సరిపోయేది**

ఈ కమిటీలోని కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతన్ శుక్లా, డైరెక్టర్ మారపల్లి వెంకటేశ్వర్లు బృందం సింగరేణిలో క్షేత్రస్థాయిలో పర్యటించింది. సింగరేణి కేంద్ర కార్యాలయంలో టెండర్లకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించింది. నైని కోల్ బ్లాక్ మైన్ డెవలపర్, ఆపరేటర్ (ఎండీవో) నియామకం కోసం నిరుడు నవంబర్ 28న జారీ చేసిన టెండర్ ఆహ్వాన నోటీసును విశ్లేషించింది. కొత్తగా చేర్చిన నిబంధనలు, టెండర్ రద్దుకు కారణాలేంటి? అనే అంశాల మీద ప్రధానంగా దృష్టి కేంద్రీకరించి వివరాలు సేకరించినట్టు తెలిసింది. సింగరేణి కొత్తగా రూపొందించి అమలుచేసిన టెండర్ నిబంధనకు, ఇతర కంపెనీలు అనుసరిస్తున్న నిబంధనలకు మధ్య ఉన్న వ్యత్యాసాలను పోల్చారని సమాచారం.

నైని టెండర్ల నిబంధనల్లో అక్రమాలు జరిగినట్టుగా నిర్ధారించినట్టు తెలిసింది. సైట్ విజిట్ తప్పని సరి అనే నిబంధన టెండర్ ప్రక్రియను తీవ్ర ప్రభావితం చేసిందని సాంకేతిక కమిటీ నిర్ధారించినట్టు సమాచారం. సెల్ఫ్ డిక్లరేషన్ పద్ధతిని అనుమతిస్తే సరిపోతుందని, 'నేను సైట్ చూశాను, అకడి పరిస్థితులు నాకు తెలుసు' అని బిడ్డర్ సంతకం చేసి ఇస్తే సరిపోతుందని, కానీ సింగరేణి ఒక ప్రభుత్వ రంగ సంస్థే అయినా, కేంద్ర సంస్థల కంటే భిన్నమైన నియమాన్ని పాటించడంపై కమిటీ ఆశ్చర్యం వ్యక్తం చేసినట్టు సమాచారం. అధికారులు స్వయంగా సంతకం చేసి సర్టిఫికెట్ ఇవ్వాలనే నిబంధన ఒక రకమైన గేట్ కీపింగ్‌లాగా పని చేసిందని నివేదికలో పేర్కొన్నారట! అధికారులు ఎవరికి సర్టిఫికెట్ ఇస్తే వారే టెండర్ వేయడానికి అర్హులవుతారని, వందలాది ఇతర కంపెనీలు సెల్ఫ్ డిక్లరేషన్‌ను అనుమతిస్తున్నప్పుడు, ఇకడ మాత్రమే సర్టిఫికెట్ అడగడంపై వ్యక్తిగత లబ్ధి పొందే దురుద్దేశం ఉన్నదని కమిటీ నిర్ధారించినట్టు సమాచారం.

**10 కోట్ల ఖర్చు.. క్షమించరాని నేరం**

సంస్థకు చెందిన కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల వినియోగం, దుర్వినియోగంపై కమిటీ విచారణ చేసినట్టు తెలిసింది. అంతర్జాతీయ ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీతో ఒక ప్రైవేట్ సంస్థ నిర్వహించిన ఈవెంట్‌కు సింగరేణికి సంబంధించిన సీఎస్ఆర్ నిధులను ఖర్చు చేయడాన్ని సాంకేతిక కమిటీ తప్పుబట్టినట్టు సమాచారం. బోర్డుకు ఉన్న అటానమస్ అధికారాన్ని అడ్డంపెట్టుకొని ఉద్దేశపూర్వకంగా రూ.10 కోట్లు సింగరేణి సీఎస్ఆర్ సొమ్మును దుబారా చేశారని, దీనికి సింగరేణి అప్పటి సీఎండీ బాధ్యత వహించాల్సి ఉంటుందని నివేదికలో పొందుపరిచినట్టు తెలిసింది.

సింగరేణితో ప్రభావితమయ్యే స్థానిక ప్రజల విద్య, వైద్యం, ఆరోగ్యం, అభివృద్ధి కోసం ఖర్చు చేయాల్సిన నిధులను ప్రైవేట్ ఈవెంట్లకు కేటాయించారని, ఇది క్షమించరాని తప్పిదమని కమిటీ వ్యాఖ్యానించినట్టు సమాచారం. ఈ నిధుల మళ్లింపు వెనుక ఉన్న ఉన్నతాధికారుల పాత్రపై విచారణ జరపాలని సూచించినట్టు చెప్తున్నారు. కమిటీ నివేదిక సీఎం రేవంత్‌రెడ్డితోపాటు, మంత్రి భట్టి విక్రమార్కను ఇరుకున పెట్టిందన్న ప్రచారం జరుగుతున్నది. కేంద్రం తలుచుకుంటే సాంకేతిక కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా సీబీఐ విచారణకు ఆదేశించవచ్చని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు.



# కక్షతోనే కేసీఆర్‌కు నోటీసులు

- **ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కడానికి సిట్ పేరిట కుట్రలు బీఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్.**

**సిద్దిపేట పవర్ ప్రతినిధి:**

సిద్దిపేట, జనవరి 31: ఫోన్ ట్యాపింగ్ పేరుతో గత రెండేళ్లుగా బీఆర్ఎస్ పార్టీపై వేధింపులు కొనసాగుతున్నాయని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసలు సమస్యలను పక్కనపెట్టి ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు 'అలీబాబా 40 దొంగలు', 'దండుపాళ్యం ముఠా' తరహాలో అనేక కుంభకోణాలకు పాల్పడుతున్నారని చెప్పారు. బొగ్గు స్కామ్, 9 వేల ఎకరాల భూమి స్కామ్ తదితర అవకతవకలు జరుగుతున్నాయని, వాటి నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే రేవంత్ రెడ్డి ఈ నాటకాలు ఆడుతున్నారని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కడానికి సిట్ పేరిట కుట్రలు జరుగుతున్నాయని ప్రవీణ్ కుమార్ అన్నారు. రాజకీయ నాయకులకు ట్యాపింగ్‌తో ఎలాంటి సంబంధం ఉండదని స్పష్టం చేశారు. ఏ ముఖ్యమంత్రి కూడా నేరుగా ట్యాపింగ్ చేయమని చెప్పరని తెలిపారు. విచారణ జరుగుతున్న క్రమంలో వ్యక్తిగత హననం చేసేలా మీడియాకు లీకులు ఇస్తున్నారని, మహానేత కేసీఆర్‌ను వేధించడం అప్రజాస్వామికమని ఆయన అన్నారు.





## యశోదలో హెడ్ అండ్ నెక్ అంకాలజీ సదస్సు

**సికింద్రాబాద్, జనవరి 31 (సిద్దిపేట పవర్):**

యశోద హాస్పిటల్స్-హైటెక్ సిటీలో నిర్వహించిన అంతర్జాతీయ "హెడ్ & నెక్ ఆంకాలజీ సమ్మిట్-2026"ను సైబరాబాద్ పోలీసు కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ (ఐపీఎస్) ప్రారంభించారు. ఈ సదస్సుకు 500 మందికి పైగా ఆంకాలజీ నిపుణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హెడ్ & నెక్ క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించేందుకు AI ఆధారిత హెడ్ & నెక్ ఆంకాలజీ క్లినిక్‌ను ప్రారంభించారు. ఇది రోగులకు వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా ఆధునిక చికిత్సలు అందించడంలో కీలకంగా నిలుస్తుందని యశోద హాస్పిటల్స్ ప్రతినిధులు తెలిపారు.



## గద్దర్ కు నివాళులు అర్పించిన ముదిరాజు నేత

**సికింద్రాబాద్, జనవరి 31 ( సిద్దిపేట పవర్ ):**

తెలంగాణ విముక్తి పోరాట వీరుడు, ప్రజాగాయకుడు గద్దర్ జయంతిని పురస్కరించుకొని తెలంగాణ ఉద్యమ నాయకుడు, ముదిరాజ్ నేత పొట్లకాయ వెంకటేశ్వర్ ముదిరాజ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గద్దర్ తెలంగాణ ఉద్యమానికి అందించిన సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు.





## నేను మీ ఇంటి ఆడబిడ్డను.. మీ ఆశీస్సులతో అభివృద్ధి చేస్తా

- **5వ వార్డు కౌన్సిలర్ కాంగ్రెస్ అభ్యర్థి ఊడెం సారిక శ్రీనివాస్ రెడ్డి**

**సిద్దిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం ప్రతినిధి:**

గజ్వెల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నీ 5వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి ఊడెం సారిక శ్రీనివాస్ రెడ్డి నీ భారీ మెజార్టీ తో గెపించండి నేను మీ ఇంటి ఆడ బిడ్డను ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా అంటూ ఇంటింటి ప్రచారంలో ప్రజలను కోరారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేను మీ ఇంటి ఆడ బిడ్డను ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా మీ ఆశీస్సులు అండ దండలు తమ పై ఉండలని వార్డు అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మహాలక్ష్మి లకు పథకం సన్న బియ్యం ఉచిత కరెంట్ వంటి సంక్షేమ పథకాలు ప్రజలకు ఎన్నెన్నో చేస్తుందని భారీమెజార్టీ తో గెలిపించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో గజ్వెల్ ఏఎంసీ డైరెక్టర్ యాదయ్య నాయకులు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేశి రెడ్డి రవీందర్ రెడ్డి నాయకులు సాయిలు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నోటీసులు అక్రమం.. అయినా విచారణకు వస్తా.!

**మొదటిపేజీ తరువాయి**

సహకరిస్తానని తెలిపారు.

కేసీఆర్ లేఖలో ఏం రాశారంటే.. 'సిట్ అధికారులు వ్యవహరించిన తీరు చట్టాలకి వ్యతిరేకం. సుప్రీంకోర్టు తీర్పులను తుంగలో తొక్కిన సిట్ అధికారుల తీరు. సిట్ అధికారులకి నోటీసు ఇచ్చే అధికారమే లేదు. ఇది నా రాజ్యాంగ హక్కులను కాలరాయడమే. మొన్న రెండుసార్లు సిట్ అధికారులు ఇచ్చిన నోటీసులు చట్టవిరుద్ధం, చట్టాలను అతిక్రమించి ఇచ్చారు. మీరు ఇచ్చిన మొదటి నోటీసుకు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బిజీగా ఉండటంవల్ల వేరే రోజు విచారణకు తేదీ ఇవ్వాలని చెప్పాను. దాంతోపాటు 65 ఏళ్ల పైబడిన వ్యక్తులను వారు నివసించే చోటనే విచారించాలని చెప్పే సెక్షన్ 160 CrPC నిబంధనను మీ దృష్టికి తెచ్చాను' అని పేర్కొన్నారు.

'తదుపరి నోటీసులన్నీ కూడా ఎర్రవల్లిలోని నా నివాసానికే పంపాలని చెప్పాను. కానీ, ఇది చెప్పిన తర్వాత కూడా గుర్తుతెలియని వ్యక్తులు మీ సంతకంతో ఉన్న లేఖను రాత్రి 9 గంటలకు నందినగర్ నివాసంలోని మా ఇంటి గోడకు అతికించినట్లు తెలుస్తోంది. ఆ లేఖ మీరే పంపినట్లయితే, మీ సూచనల మేరకే అతికించినట్లయితే, ఆ లేఖను తీవ్రంగా ఆక్షేపిస్తున్నాను. ఇది భారత రాజ్యాంగం, చట్టం, గౌరవ సుప్రీంకోర్టుల పట్ల మీకు ఏమాత్రం గౌరవం లేదు అనే విషయాన్ని సూచిస్తుంది. గతంలో సుప్రీంకోర్టు 'సతేంద్ర కుమార్ యాంటిల్ వర్సెస్ సీబీఐ' అనే కేసులో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వాట్సాప్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా నోటీసులు పంపడం చట్టబద్ధమైన పద్ధతి కాదని, చట్టం నిర్దేశించిన రీతిలోనే నోటీసులు ఇవ్వాలని పేర్కొంది. CRPC 160 నోటీసులను వ్యక్తిగతంగా అందజేయాలి. కానీ మీరు కావాలనే చట్టాన్ని, సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించారు. ఇది కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది' అని కేసీఆర్ తన లేఖలో సూచించారు.

'భవిష్యత్తు నోటీసులన్నీ ఎర్రవల్లికే పంపాలని చెప్పినప్పటికీ మీరు దాన్ని విస్మరించారు. కాబట్టి మీరు ఇచ్చిన రెండో నోటీసు చట్టబద్ధంగా అందలేదు, అది చెల్లదు. మీరు ఇచ్చిన నోటీసు నా రాజ్యాంగబద్ధ హక్కులను ఉల్లంఘించడమే. నేను మీ పోలీస్ స్టేషన్ పరిధిలోగానీ, పొరుగు పోలీస్ స్టేషన్ పరిధిలోగానీ నివసించడం లేదు. కాబట్టి మీకు నోటీసు ఇచ్చే అధికార పరిధి లేదు. ఈ నోటీసుతో నన్ను కట్టడి చేసే అధికారం లేదు. ఎలక్షన్ అఫిడవిట్‌లో, అసెంబ్లీ రికార్డులో ఉన్న అడ్రస్ ఆధారంగా ఎర్రవల్లిలో విచారించలేమని మీరు చెప్పడం సరికాదు. నోటీసు ఇచ్చే సమయానికి వ్యక్తి ఎక్కడ నివసిస్తున్నారు అన్నదే ముఖ్యం. నేను కొన్ని సంవత్సరాలుగా ఎర్రవల్లిలో నివసిస్తున్నాను అన్నది నిర్వివాద అంశం. అక్కడే నా స్టేట్‌మెంట్ రికార్డ్ చేయవలసిన బాధ్యత మీపై ఉన్నది' అని పేర్కొన్నారు.

'హరీష్ రావు అఫిడవిట్ లో సిద్దిపేట అని చిరునామా ఉన్నప్పటికీ హైదరాబాద్‌లో నోటీసు ఇచ్చారు. ఇది మీ ద్వంద్వ ప్రమాణాలను సూచిస్తున్నది. మీరు గోడకు నోటీసు అతికించడం చట్టవిరుద్ధం. మీరు నాకు నోటీసు ఇచ్చే అధికార పరిధి లేదు. చట్టం ప్రకారం నా స్టేట్‌మెంట్‌ను ఎర్రవల్లిలోనే రికార్డ్ చేయాలి. అయితే చట్టపరమైన అంశాలు ఎలా ఉన్నప్పటికీ, మాజీ ముఖ్యమంత్రిగా, ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడిగా, బాధ్యతాయుతమైన భారత పౌరుడిగా దర్యాప్తుకు సహకరించాలని నిర్ణయించుకున్నాను. రేపు మధ్యాహ్నం 3 గంటలకు నందినగర్‌లో అందుబాటులో ఉంటా. మీరు నందినగర్ నివాసంలోనే స్టేట్‌మెంట్ రికార్డ్ చేయాలని పట్టుబట్టినందున అక్కడే అందుబాటులో ఉంటా' అని కేసీఆర్ లేఖ ద్వారా తెలియజేశారు.



# తన పాటల రూపంలో గద్దరన్న ఇంకా బతికే ఉన్నాడు

- సాంస్కృతిక కళాకారుడు పిన్నింటి రత్నం
- కొమురవెల్లి లో ప్రజా యుద్ధనౌక గద్దర్ జన్మదిన వేడుకలు




**కొమురవెల్లి, జనవరి 31 (సిద్దిపేట పవర్)**

కొమురవెల్లి మండల కేంద్రంలో ప్రజా వాగ్గేయకారులు ప్రజా యుద్ధనౌక గద్దరన్న 78వ జయంతి వేడుకలు తెలంగాణ సాంస్కృతిక సారథి కవి గాయకులు పిన్నింటి రత్నం ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ హాజరు అయ్యి గద్దర్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళి అర్పించి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య విలువల గురించి తెలంగాణ సమాజ మార్పు గురించి తన మాట పాటల ద్వారా రగిలే జ్వాలై ఎన్నో చైతన్య కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు.. అదే విధంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం గురుంచి ఎంతో త్యాగం చేశారని రైతు కూలీల గురించి అడవి బిడ్డల గురించి కుల వివక్షత గురించి మూడ నమ్మకాల గురించి పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలం అని బహుజన బ్రతుకుల లో వెలిగే పాటగా జీవించారని మన రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ సేవలను గుర్తించి గద్దర్ అన్న అవార్డులు కూడా ఇచ్చి గౌరవించుకున్నదని కొనియాడారు..ఈ కార్యక్రమంలో కొమురవెల్లి ఉప సర్పంచ్ పోతుగంటి శ్రీనివాస్, ఉద్యమ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు పిన్నింటి దాసు,దేవస్థానం డైరెక్టర్లు సార్ల లింగం,బొచ్చు ఎల్లయ్య యాదవ్, మాజీ ఎంపిటిసి మేరుగు కృష్ణ,పిఏసి యస్ మాజీ డైరెక్టర్ బత్తిని నర్సింహులు,గద్దరన్న అభిమాన నాయకులు గొల్లపల్లి ఆంజనేయులు,పంజాల నర్సిములు,తీన్మార్ మల్లన్న టీం నాయకులు పుట్ట రమేష్ సోషల్ మీడియా కన్వీనర్ రమేష్,కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు ఎరువుల రాజు, ఉప్పల వంశీ,పిన్నింటి కుమార్,వెల్ది ఆంజనేయులు,గడ్డం పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్‌లో కొత్త మంచినీటి పైపు లైన్ ప్రారంభం

**సికింద్రాబాద్, జనవరి 31 ( సిద్దిపేట పవర్ ):**



సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డ్ పరిధిలోని వార్డ్ 3, బాలజ్యోతి పాఠశాల సమీపం లోని అన్న నగర్ వీధిలో కంటోన్మెంట్ బోర్డ్ నిధుల ద్వారా రూ. 4,90,000/ ఖర్చుతో కొత్త మంచినీటి పైపు లైన్ పనులను కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ మెంబర్ భానుక నర్మదా మల్లికార్జున్ ప్రారంభించారు.ఈ సందర్భంగా భానుక నర్మదా మల్లికార్జున్ మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో స్థానిక పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ సహకారంతో వార్డులోని సమస్యలకు పరిష్కారం చూపిస్తామన్నారు. అలాగే, త్వరలో ఎంపీ సహకారంతో ఒక బోర్‌వెల్ ఏర్పాటు చేయనున్నారు అని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి వార్డ్ అధ్యక్షులు అరుణ్ కుమార్, మహంకాళి జిల్లా ఉపాధ్యక్షులు బి.ఎన్. శ్రీనివాస్, కంటోన్మెంట్ మహిళా మోర్చా కన్వీనర్ వినోద, వార్డ్ మహిళా మోర్చా అధ్యక్షురాలు అనురాధ, బిజెపి నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక బస్తీ వాసులు మధు, హరికృష్ణ, నరేష్, రేఖ, వనిత పాల్గొన్నారు.

# ఇక నుంచి ప్రతి ఏడాది వైద్య విద్యార్థుల ఓరియంటేషన్ వర్క్ షాప్

- గాంధీ మెడికల్ కాలేజీలో విజయవంతంగా తొలి వార్షిక 'గ్రో' పరిశోధన సదస్సు
- సంఖ్యలో వైద్య విద్యార్థుల హాజరు




**హైదరాబాద్, జనవరి 31 ( సిద్దిపేట పవర్ ):**

గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్ని మెడికల్ ఎడ్యుకేషనల్ సొసైటీ (GMCAMES) ఆధ్వర్యంలో తొలి వార్షిక 'గ్రో' (గాంధీ రీసెర్చ్ ఓరియెంటేషన్ వర్క్‌షాప్) సదస్సు జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో ఘనంగా నిర్వహించబడింది. సదస్సును కేఎన్‌ఆర్‌యూహెచ్‌ఎస్ వైస్‌చాన్సలర్ డా. కె. రమేష్ రెడ్డి ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఎంఈ డా. నరేంద్ర కుమార్, గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. కె. ఇందిరా, అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు డా. లింగమూర్తి, ట్రెజరర్ డా. సన్నీ డేవిస్ తదితరులు పాల్గొన్నారు. రెండు రోజుల సదస్సులో దేశ-విదేశాల నుండి 500 మందికి పైగా వైద్య నిపుణులు పాల్గొని, క్లినికల్ మెడిసిన్, పబ్లిక్ హెల్త్, ట్రాన్స్లేషనల్ రీసెర్చ్, మెడికల్ ఎడ్యుకేషన్‌లో తాజా పరిణామాలపై ప్రసంగాలు, ప్యానెల్ చర్చలు, జేఏఎం సెషన్స్, పోడియం మరియు ఇపోస్టర్ ప్రెజెంటేషన్స్ నిర్వహించారు.డాక్టర్ ప్రభాకర్ శర్మ , డాక్టర్ మంజూషా ఎడ్ల నేతృత్వంలో సదస్సు జిఎంసి గ్లోబల్ అలయన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ .. వివిధ మెడికల్ కాలేజీ నుంచి పెద్ద సంఖ్యలో వైద్య విద్యార్థులు ఈ వర్క్ షాప్ కు హాజరయ్యారని తెలిపారు. వైద్య విద్యార్థుల గొప్ప స్పందనతో తాము ఇకపై ప్రతి సంవత్సరం ఇలాగే ఓరియంటేషన్ వర్క్ షాప్ నిర్వహిస్తామని తెలిపారు. ఇది కేవలం హైదరాబాద్ కే పరిమితం కాకుండా రాష్ట్రంలోని ఆయా ప్రాంతాలతో పాటు దేశ స్థాయిలో కూడా నిర్వహించే ఆలోచన ఉందని అన్నారు.

# మీ బిడ్డను.. ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా

- 4వ వార్డు కౌన్సిలర్ బీ ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి మర్కంటి వరలక్ష్మి కనకయ్య

**సిద్దిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం ప్రతినిధి :**

గజ్వెల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నీ 4వ వార్డు బీ ఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మర్కంటి వరలక్ష్మి కనకయ్య నీ భారీ మెజార్టీ తో గెపించండి ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా అంటూ ఇంటింటి ప్రచారంలో ప్రజలను కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వెల్ అభివృద్ధినీ మాజీ సీఎం కెసిఆర్ దేశంలోనే నెంబర్ వన్ గా దేశంలోనే అగ్రామీగా నిలిపిన వ్యక్తి కెసిఆర్ కదా అని అన్నారు. గజ్వెల్ ఎడ్యుకేషన్ హబ్బు ప్రభుత్వ ఆసుపత్రి రోడ్ల విస్తరణ అండర్ డ్రైనేజి ప్రతి గల్లికి సీసీ రోడ్ల వేసిన ఘనత కెసిఆర్ అని, కెసిఆర్ గజ్వెల్ ఎమ్మెల్యే గెలిపించిన మనం అదృష్టవంతువంతులమని పేర్కొన్నారు. ఇప్పుడు ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం రోడ్లు కొట్టుకుపోతే గుంతలు పుడ్చాలని సోయి లేని అసమర్థులని అన్నారు.మీ బిడ్డను ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా మీ ఆశీస్సులు అండ దండలు తమ పై ఉండలని వార్డు అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాచమల్ల ఉపేందర్ రెడ్డి, బట్టు సుధాకర్ రెడ్డి శ్రీరామ్ మల్లేశం ఎల్లా వెంకటేష్ పాటు కళ్యాణ్ పేదల పోశయ్య సోమ్ రాజు ఎల్లా శ్రీనివాస మహేష్ రాజు సాయి గట్టు కొమురయ్య మాజీ ఉప సర్పంచ్ జూపల్లి భాస్కర్ మాజీ వార్డు నెంబర్ ఈరమైన దేవేందర్ శ్రీనివాస్ రెడ్డి కోనమైన రమేష్ బీ ఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# హ్యాండ్ ఆఫ్ చారిటబుల్ హెల్ప్ ట్రాస్ట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

- తబిత జైపాల్ రెడ్డి సౌజన్యంతో

**సిద్దిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గంప్రతినిధి :**






హ్యాండ్ ఆఫ్ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ తబిత జేపాల్ రెడ్డి సౌజన్యం ఉచిత మెగా ఉచిత వైద్య శిబిరం మందుల పంపిణీ టీచర్స్ కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా సర్పంచ్ పనుగట్ల శ్రీనివాస్ రెడ్డి ఉప సర్పంచ్ మచ్చ గణేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ కన్సల్టేషన్ ఫీజు లేకుండా రక్త పరీక్షలు బిపి షుగర్ కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు కళ్ళ పంపిణీ చేశారు.ఈ సందర్భగా మెడికల్ క్యాంపు వైద్యురాలు డాక్టర్ రిబ్కా, హ్యాండ్ ఆఫ్ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ తబిత జెపాల్ రెడ్డి గ్రామ సర్పంచ్ పనుగట్ల శ్రీనివాస్ గౌడ్ మట్లాడుతూ హ్యాండ్ ఆఫ్ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ గ్రామాల్లోని పేద ప్రజలకు సేవలందించాలని లక్ష్యం తో ఉచిత వైద్య శిబిరంలను ఏర్పాటు చేస్తున్నామని, మానవ సేవయే మాధవ సేవ అనే విధంగా పేద ప్రజల కు ఆరోగ్య సేవలందించాలనే లక్ష్యం తో పనిచేస్తున్నామని అన్నారు.ఈ మెడికల్ క్యాంపులో ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందనీ అన్నారు. అంతకుముందు హ్యాండ్ ఆఫ్ హెల్ప్ ఆధ్వర్యంలో జగదేవపూర్ మండల ప్రజలకు పురుషులకు మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ మహిళలకు కుట్టుమిషన్ల శిక్షణ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జగదేవపూర్ గ్రామ స్థానిక సర్పంచ్ పనుగట్ల శ్రీనివాస్ గౌడ్ ఉప సర్పంచ్ మచ్చ గణేష్ హాజరై కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.మండలంలోని నిరుద్యోగ యువత యువకులు ఇది మంచి సదా అవకాశం మహిళలు పురుషులు ఇలాంటి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బత్తిని శ్రీనివాస్ బచ్చలి భాస్కర్ డప్పు సంధ్యా సాయి యూత్ అధ్యక్షులు పనుగట్ల గణేష్ నాయకులు అరుణ్ హరి ప్రసాద్ రాజు భాస్కర్ ఫీల్డ్ కోఆర్డినేటర్ క్రిస్టఫర్ పాస్టర్ యాకూబ్ కృపాల్ రెడ్డి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క–సారలమ్మలను దర్శించుకున్న డాక్టర్ కోట నీలిమ

**సికింద్రాబాద్, జనవరి 31 (సిద్దిపేట పవర్):**

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని సమ్మక్క-సారలమ్మ వనదేవతలను శనివారం పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు, ఎండోమెంట్ అధికారులు ఆమెకు స్వాగతం పలికారు. గిరిజన సంప్రదాయాల ప్రకారం గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి బంగారం సమర్పించారు. డాక్టర్ కోట నీలిమ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో చేపట్టిన పునరుద్ధరణ పనులు జాతరకు వచ్చే భక్తులకు మరింత సౌకర్యంగా మారాయని తెలిపారు. రాష్ట్ర ప్రజల శాంతి, సుఖ సంతోషాలతో పాటు సనత్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం వనదేవతలను ప్రార్థించినట్లు పేర్కొన్నారు. మేడారం జాతర ఆసియాలోనే అతిపెద్ద మహాజాతరగా ప్రసిద్ధి చెందిందని తెలిపారు.



# జింఖానా గ్రౌండ్ లో ప్రధాని సంసద్ ఖేల్ మహోత్సవం

**సికింద్రాబాద్, జనవరి 31 ( సిద్దిపేట పవర్ ):**

దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రేరణతో దేశవ్యాప్తంగా గత నెల లో ప్రారంభమైన ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌కు మాజీ మంత్రి, ఎన్‌డీఎంఏ మాజీ ఉపాధ్యక్షులు, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు మర్రి శశిధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులతో కలిసి మైదానంలో క్రికెట్ ఆడి ఆటను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతను క్రీడల వైపు ఆకర్షించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని, ఇలాంటి టోర్నమెంట్లు గ్రామీణ, పట్టణ స్థాయిలో ప్రతిభను వెలికితీయడానికి దోహదపడతాయని తెలిపారు. క్రీడల ద్వారా ఆరోగ్యం, క్రమశిక్షణ, జట్టు భావన పెరుగుతాయని పేర్కొన్నారు.క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# గజ్వెల్ బీ ఆర్ యస్ ఇంచార్జి ప్రతాప్ రెడ్డి సంక్షేమంలో కాంగ్రెస్ నుండి బి ఆర్ యస్ చేరిన ఏం డీ యూనీస్

- 6వ వార్డు బొగ్గుల సురేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నుండి బీ ఆర్ యస్ లో చేరిన యూనిస్

**సిద్దిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం ప్రతినిధి :**



గజ్వెల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బి ఆర్ ఎస్ పార్టీ 6 వార్డులో బొగ్గుల సురేష్ ఆధ్వర్యంలో మహమ్మద్ యూనిస్ సొంత గుడికి గజ్వెల్ బీఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి సంక్షేమంలో కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బొగ్గుల సురేష్ మాట్లాడుతూ కెసిఆర్ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు పనులను ఆకర్షతులై మళ్లీ బీఆర్ఎస్ పార్టీలోకి చేరుకోవడం జరిగిందని అభివృద్ధి వైపై ప్రజలు ఉంటారని 10 సంవత్సరాల అభివృద్ధి చూసి మళ్లీ కెసిఆర్ కావాలని బీఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమం లో 6వ ఇంచార్జ్ డ్రాగన్ బిక్షపతి, రామచంద్రం కరీం గౌస్ పాషా జహంగీర్ రహీం సద్దాం బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ క్రిడలో తిగుల్ విద్యార్థుల ప్రతిభ

**సిద్దిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం ప్రతినిధి :**

జగదేవపూర్ సీఎం కప్ క్రిడ మండల స్థాయి పోటీలు తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి ప్రతిభ చాటారు. శనివారం మండల కేంద్రమైన జగదేవపూర్ లో బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సీఎం క్రీడా పోటీలను తహసిల్దార్ నిర్మల, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, ఎస్సై కృష్ణారెడ్డి, ఎంఈఓ సైదులు, ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ పోటీల్లో తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఖోఖో క్రిడలో బాలికలు ప్రథమం, ఖోఖో బాలుర పోటీల్లో ప్రథమం, బాలుర వాలీబాల్ పోటీల్లో ప్రథమం రాణించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. మూడు విభాగాల్లో ప్రథమ స్థానం రావడంతో విద్యార్థులను మండలం స్థాయి అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఎంపీడీవో చేతుల మీదుగా బహుమతులను అందించారు. ఈ సందర్భంగా మండల స్థాయి క్రీడా పోటీలో ప్రతిభా చాటి ప్రథమ స్థానంలో నిలవడంతో గ్రామ సర్పంచి రజిత క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ప్రధానోపాధ్యాయులు అనసూయ, పి ఈ టి రాజిరెడ్డిలను అభినందించారు.

